కేసీఆర్ సేవ అద్భుతం

కేసీఆర్ పాలనకు ప్రతీక ఆర్థిక సర్వే నివేదిక

- తెలంగాణ మాడల్ విజయాన్ని ప్రతిబింబిస్తున్నది: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన తాజా ఆర్థిక సర్వే 2024-25 కేసీఆర్ పాలనకు ప్రతీక అని, తెలంగాణ మాడల్ విజయాన్ని ప్రతిబింబిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు తెలిపారు. ఈ నివేదిక బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ సాధించిన సమగ్ర అభివృద్ధిని, వివిధ రంగాల్లో సాధించిన ప్రగతిని సూచిస్తున్నదని పేర్కొన్నారు. సర్వేలోని ప్రధాన అంశాలను కేటీఆర్ శుక్రవారం ఎక్స్ వేదికగా వెల్లడించారు.

ఎస్వోటీఆర్‌లో టాప్

తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తున్న అబద్ధాలను సర్వే కొట్టిపారేసింది. తెలంగాణ రాష్ట్రం 88% సొంత పన్ను ఆదాయం (ఎస్వోటీఆర్)లో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. కేసీఆర్ అనుసరించిన ఆర్థిక విధానాలు ఈ విజయాన్ని సాధించాయి.

జలవనరుల విస్తరణలో రికార్డు

తెలంగాణలో సాగుకు యోగ్యమైన భూమిలో దాదాపు 90 శాతానికి సాగునీరు అందుబాటులో ఉన్నది. ఇదంతా కేసీఆర్ హయాంలో చేపట్టిన ప్రాజెక్టుల వల్లే సాధ్యమైంది. కాళేశ్వరం వంటి ప్రాజెక్టులపై చేస్తున్న అసత్య ప్రచారాలకు సర్వే తెరదించింది. జలవనరుల్లో ముందంజలో ఉన్నట్టు వెల్లడించింది.

ప్రతిష్ఠాత్మక చర్యలు

2017లో గ్లోబర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్ (జీఈఎస్)లో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిన వీ-హబ్ దేశానికి రోల్‌మాడల్‌గా నిలిచింది. దేశంలో మహిళల వ్యాపార ప్రేరణలో కీలకమైన ప్రాతినిధ్యంగా మారింది.

100% తాగునీరు అందుబాటు

కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన మిషన్ భగీరథ పథకం దేశానికి ఆదర్శంగా నిలిచింది. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలబడింది.

సేవా రంగంలో అత్యుత్తమ ప్రదర్శన

తెలంగాణ రాష్ట్రం సేవా రంగంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. హైపర్-క్యాపిటా సర్వీస్ జీఎస్‌వీఏ, జీఎస్‌వీఏ సేవల్లోనూ బలమైన వాటాను రాష్ట్రం కలిగి ఉన్నది. కేసీఆర్ పాలనను, ప్రతిష్ఠను దెబ్బతీయడానికి కాంగ్రెస్ మళ్లీమళ్లీ ప్రయత్నిస్తూనే ఉన్నది. కానీ, బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో ముందున్న రాష్ట్రంగా ఇలాంటి సర్వేలు రుజువు చేస్తూనే ఉన్నాయి' అని కేటీఆర్ వివరించారు.

మొదటిపేజీ తరువాయి...

ప్రగతిని కండ్లకు కట్టింది. ఐటీ, రియల్ఎస్టేట్ రంగంలో పదేండ్ల బీఆర్ఎస్‌పాలనలో చేపట్టిన విప్లవాత్మకమైన కార్యక్రమాల కారణంగా సేవల రంగంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. 2022-2023 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో జతచేరిన అదనపు విలువలో (గ్రాస్ స్టేట్ వ్యాల్యూయాడెడ్-జీఎస్‌వీఏ) సేవారంగం వాటా 60 శాతానికి పైగా నమోదైంది. జీఎస్‌వీఏ-సర్వీసు రంగంలో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. ఈ మేరకు ఆర్థిక సర్వే 2024-25 నివేదిక వెల్లడించింది. గడిచిన పదేండ్లలో తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ఐటీ సేవల్లో వచ్చిన విప్లవాత్మకమైన మార్పులు, రియల్‌ఎస్టేట్ రంగంలో వృద్ధి సేవారంగం విస్తరించడానికి దోహదపడిందని నివేదిక అభిప్రాయపడింది. హైదరాబాద్‌లో ఆఫీసు, నివాస స్థలాలకు మంచి గిరాకీ ఏర్పడినట్టు వివరించింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కేటీఆర్ ఐటీ శాఖ మంత్రిగా దేశ, విదేశాలు తిరిగి తీసుకొచ్చిన పెట్టుబడుల ఫలితమే ఈ ఘనత అని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

బీళ్లకు మళ్లిన సాగు జలాలు

విస్తారంగా సాగు జలాలు అందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ దేశంలోనే మూడో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో పంటలకు అనువైన భూమిలో 86 శాతం విస్తీర్ణానికి నీళ్లు అందుతున్నట్టు ఆర్థిక సర్వే స్పష్టంచేసింది. 2016-2021 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా ఉన్న సాగుయోగ్యమైన భూములకు సాగునీరు అందే విస్తీర్ణం 49.3 శాతం నుంచి 55 శాతానికి పెరిగినట్టు నివేదిక స్పష్టం చేసింది. అత్యధికంగా పంజాబ్‌లో 98 శాతం సాగుభూమికి నీరు అందుతున్నదని, హర్యానా 94 శాతంతో రెండో స్థానంలో ఉన్నదని, ఆ తర్వాత తెలంగాణ మూడో స్థానంలో నిలిచిందని పేర్కొన్నది. ఇది పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వం సాధించిన విజయమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మిషన్ కాకతీయ ద్వారా చెరువులు బాగు చేయడం, కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులు పూర్తి చేయడం, చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో నీటి వనరులు గణనీయంగా పెరిగాయని పేర్కొన్నారు. ఫలితంగా సాగుయోగ్యమైన భూములకు నీరు అందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ అగ్ర స్థానానికి ఎదిగిందని చెప్తున్నారు.

ఇంటింటికీ నల్లా నీళ్లు

దేశంలోని 8 రాష్ట్రాల్లో మాత్రమే ప్రతి ఇంటికీ శుద్ధి చేసిన తాగునీరు అందుతున్నదని నివేదిక వెల్లడించింది. ఇందులో తెలంగాణ కూడా ఉన్నది. ఇది కేసీఆర్ మానసపుత్రిక 'మిషన్ భగీరథ' కారణంగా సాధించిన రికార్డు అని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కేసీఆర్ సీఎంగా బాధ్యతలు స్వీకరించగానే మిషన్ భగీరథకు శ్రీకారం చుట్టారని.. 2016 ఆగస్టు 7న పథకానికి ప్రారంభోత్సవం చేశారని గుర్తు చేస్తున్నారు. దాదాపు రూ.40వేల కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ఫలితంగా రాష్ట్రంలో ప్రతి ఇంటికీ నల్లా ద్వారా శుద్ధిచేసిన జలాలు అందుతున్నాయని చెప్తున్నారు. ముఖ్యంగా ఈ పథకంతో నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యకు చరమగీతం పాడిందన్నారు. బీఆర్ఎస్ సర్కారు తీసుకొచ్చిన 'మిషన్ భగీరథ' పథకం స్ఫూర్తితోనే కేంద్రప్రభుత్వం 'జల్‌జీవన్ మిషన్'ను తీసుకురావడం తెలిసిందే.

'వీ హబ్'పై ప్రశంసలు

మాజీ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో ఏర్పాటైన 'వీ హబ్'పై ఆర్థిక సర్వే ప్రత్యేక ప్రశంసలు కురిపించింది. ప్రత్యేకంగా మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు చేపట్టిన తొలి ప్రయత్నంగా అభినందనలు కురిపించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు స్టార్టప్ ప్రారంభించేందుకు అవసరమైన ఆర్థిక, సాంకేతిక, పాలసీపరమైన సహకారాన్ని తెలంగాణ ప్రభుత్వం అద్భుతంగా అందించినట్టు సర్వే కొనియాడింది. ఇందుకు రూ.177 కోట్లు కేటాయించినట్టు తెలిపింది. వీ హబ్‌తో 6,376 అంకుర సంస్థలు, ఎస్ఎంఈ(స్మాల్ అండ్ మీడియం సైజ్ ఎంటర్‌ప్రైజెస్)లను ఏర్పాటు చేయగలిగిందని అభినందించింది. 87 స్టార్టప్ ప్రోగ్రామ్స్‌ను ప్రారంభించి 7,828 మంది మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ ఇచ్చిందని వెల్లడించింది. ఇక్కడ ఊపిరి పోసుకున్న స్టార్టప్‌లలో 75 శాతం రెండేండ్ల నుంచి విజయవంతంగా కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయని పేర్కొన్నది. మొత్తంగా 'వీ హబ్' దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని కొనియాడింది.

వీ-హబ్ భేష్

వీ-హబ్ ద్వారా 6376 స్టార్టప్‌లు, ఎస్ఎంఈలు నమోదు కాగా ఇందులో 75 శాతం అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నాయి. ప్రీఇంక్యుబేషన్ కింద అప్‌స్టర్జ్, గ్రేటర్50-వీ స్పార్క్ కార్యక్రమాల ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు ఆర్థికపరమైన అంశాలపై శిక్షణ నిచ్చి సహకరించింది. ఇంక్యుబేషన్ తర్వాత ఇంక్యుబేషన్ కోహోర్ట్-3, ఎఫ్ఎల్‌వో ఇంక్యుబేషన్, వీంచర్ ప్రోగ్రాముల ద్వారా అండగా నిలిచింది. ఈ పాలసీ ద్వారా స్టార్టప్ నుంచి స్కేలప్, గ్లోబల్ మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశాలను పెంపొందించిందని ఎకానమిక్ సర్వే పేర్కొంది.

దేశంలో తొలి ఘనత

మహిళలను ఆర్థిక శక్తి చోదకులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో దేశంలోనే తొలిసారిగా కేసీఆర్ ప్రభుత్వం వీ-హబ్ వంటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మహిళలు పారిశ్రామికవేత్తలుగా నిలదొక్కుకునేలా ఇంక్యుబేషన్, ఫండింగ్, మార్కెటింగ్ మెలకువలతో నిష్ణాతులుగా తీర్చిదిద్దేందుకు వెన్నుతట్టి ప్రోత్సహించింది. ఈ కార్యక్రమం ద్వారా మెట్రో నగరాలతోపాటు, గ్రామీణప్రాంత మహిళలు కూడా పారిశ్రామికవేత్తగా ఎదిగే అవకాశం ఏర్పడింది. దేశంలో ఇప్పటివరకు ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ తరహా కార్యక్రమాన్ని అమలు చేయలేదు. కేసీఆర్ హయాంలో ఆవిష్కరించిన వీ-హబ్ నేడు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది.

సొంత పన్ను ఆదాయంలో టాప్

2024 ఏప్రిల్ నుంచి నవంబర్ మధ్య పోల్చినప్పుడు సొంత పన్ను ఆదాయ వసూళ్లలో (ఎస్‌వోటీఆర్)తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 88 శాతం వసూళ్లు నమోదు చేసింది. ఇది దేశంలోనే అత్యధికం. తర్వాత కర్ణాటక, హర్యానా రాష్ట్రాలు నిలిచాయి. కేసీఆర్ ప్రభుత్వం పదేండ్లలో చేసిన అభివృద్ధి పునాదులే ఇందుకు కారణమని ఆర్థిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పదేండ్లలో సొంత పన్ను రాబడుల వృద్ధిలో తెలంగాణ దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా ఉన్నదని గుర్తు చేస్తున్నారు. వ్యాట్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ డ్యూటీలు, భూమి పన్ను, వాణిజ్య పన్నులు, అమ్మకాల పన్ను తదితర ఆదాయ వనరులను ఎస్‌వోటీఆర్‌గా పిలుస్తారు. కరోనా విపత్తు సమయంలోనూ అన్ని రాష్ట్రాలు మైనస్ వృద్ధి రేటు సాధిస్తే.. తెలంగాణ మాత్రమే ధనాత్మక వృద్ధి నమోదు చేసిందని గుర్తు చేస్తున్నారు. ఆర్థిక పునాదులు బలంగా ఉన్న కారణంగానే ఈ ఏడాది సైతం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచినట్టు చెప్తున్నారు.

ఆర్థిక సర్వే కాంగ్రెస్‌కు చెంపపెట్టు

- రైతుబంధుపై ముఖ్యమంత్రి రేవంత్‌వన్నీ అబద్ధాలే
- 'ఎక్స్' వేదికగా మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ పాలనలో జరిగిన సమగ్ర అభివృద్ధి కేంద్ర ఆర్థిక సర్వేతో మరోసారి రుజువైందని, ఇది కాంగ్రెస్‌కు చెంపపెట్టు లాంటిదని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. స్టేట్ ఓన్డ్ ట్యాక్స్ రెవెన్యూ, మిషన్ భగీరథ, ఐటీ, నీటిపారుదల రంగం, వీ హబ్‌లలో సాధించిన ప్రగతితో తెలంగాణ అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో ఆర్థిక స్థిరత్వం, సాగునీటి రంగం, గ్రామీణ మౌలిక సదుపాయాలు, ఐటీ విస్తరణ, మహిళా సాధికారతలో అసాధారణమైన అభివృద్ధి జరిగినట్టు పేర్కొన్నారు. కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలు అబద్ధాలని ఆర్థిక సర్వేతో రుజువైందని చెప్పారు. మరో ట్వీట్‌లో.. ముఖ్యమంత్రి హోదాలో ఉండి రేవంత్ పచ్చి అబద్ధాలు మాట్లాడటం సిగ్గుచేటని హరీశ్‌రావు మండిపడ్డారు. నాడు పీసీసీ చీఫ్‌గా రైతుబంధును ఆపి, నేడు సీఎం హోదాలో కేసీఆర్ రైతుబంధు ఇవ్వలేదని బద్నాం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రెండు రోజుల్లో రైతుల అకౌంట్లలో రైతుబంధు డబ్బులు పడతాయని 25 నవంబర్ 2023 పాలకుర్తి పబ్లిక్ మీటింగ్‌లో తాను చెబితే, మరుసటి రోజు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది ఎవరని ప్రశ్నించారు. రైతుబంధు పథకం ఆపేందుకు కుట్ర చేసి, రైతుల నోట్లో మట్టి కొట్టింది ఎవరని నిలదీశారు. నాడు రేవంత్ చేసిన ఫిర్యాదు లెటర్, ట్విట్టర్ పోస్టును ఈ సందర్భంగా హరీశ్‌రావు ట్వీట్‌కు జతపర్చారు.

8 శాతం వృద్ధిరేటు అవసరం

- సీఈఏ అనంత నాగేశ్వరన్

న్యూఢిల్లీ, జనవరి 31: భారత ఆర్థిక వ్యవస్థ 2047కల్లా అభివృద్ధి చెందినదిగా అవతరించాలంటే కనీసం రెండు దశాబ్దాలపాటు 8 శాతం వృద్ధిరేటును సాధించాలని ముఖ్య ఆర్థిక సలహాదారు (సీఈఏ) వీ అనంత నాగేశ్వరన్ అన్నారు. శుక్రవారం 2024-25కుగాను ఆర్థిక సర్వే విడుదలైన నేపథ్యంలో ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారత ఆర్థిక వృద్ధిరేటు మందగమనం అంతర్జాతీయ పరిస్థితులు బాగాలేకపోవడం వల్లేనని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే అంతర్జాతీయ అనుకూల పరిస్థితులను అందిపుచ్చుకుంటే వచ్చే 20 ఏండ్లకుపైగా కాలంలో అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్ కూడా ఉండగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇక వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను దేశ జీడీపీ 6.3-6.8 శాతం మధ్య ఉంటుందని ఆర్థిక సర్వేలో అంచనా వేయగా, దేశీయ ఎగుమతులు పుంజుకుంటే మరో అర శాతం లేదా ఒక శాతం వృద్ధిరేటు పెరిగేందుకు వీలుంటుందని చెప్పారు. ఇదే జరిగితే 7.5-8 శాతానికి జీడీపీ నమోదు కావచ్చన్నారు.

వ్యవ'సాయం' అవసరం

సర్వే ముఖ్యాంశాలు

- వాతావరణ పరిస్థితులు, గిడ్డంగుల కొరత దేశంలో సాగు రంగాన్ని సమస్యాత్మకంగా మారుస్తున్నాయి.
- గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికులు వ్యవసాయేతర పనులు, కార్యకలాపాలపైనే దృష్టి పెట్టడం సమీప భవిష్యత్తులో ఇబ్బందే.
- ఉద్యోగులు, కార్మిక శక్తిలో నైపుణ్యాలు తగ్గిపోతున్నాయి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాలే కీలకం.
- చదివిన చదువులు, చేస్తున్న పనికి సంబంధం లేకుండా పోతున్నది. అరకొర ప్రతిభతోనే ఎక్కువమంది ఉద్యోగ రంగంలోకి అడుగుపెడుతున్నారు.
- సాంకేతిక విద్య అందరికీ అందేలా ప్రభుత్వం దృష్టిపెట్టాలి. ప్రైవేట్ రంగ భాగస్వామ్యంతో నైపుణ్యాభివృద్ధి దిశగా ప్రభుత్వం ముందుకెళ్లాలి.
- దేశంలో ఉద్యోగ కల్పన పెరగాలి. ఉద్యోగాల్లో మహిళల భాగస్వామ్యం తగ్గుతున్నది.
- ఆటోమొబైల్, టెక్స్‌టైల్, ఫార్మా, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో వృద్ధి అంతంతమాత్రం. ప్రోత్సాహకాలు, చేయూత అవసరం.
- దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ జోక్యం తగ్గాల్సిన అవసరం ఉన్నది.
- మహిళలు, రైతులు, యువత, పేదల అభ్యున్నతికి విధానపరమైన సంస్కరణలు అవసరం.
- వ్యాపార, పారిశ్రామిక రంగాల వృద్ధికి ఆకర్షణీయ వాణిజ్య సంస్కరణల్ని ఆచరణలో పెట్టాలి.
- ఆయా రంగాలపై విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలి.
- దేశీయ వృద్ధి చోదకాలకు పెద్దపీట వేయాలి.
- వ్యక్తిగత, చిరు వ్యాపారుల ఆర్థిక స్వేచ్ఛకు ప్రతిబంధకాలుగా రెగ్యులేటరీ విధానాలు.
- డిజిటలైజేషన్, ఏఐ ఆధారిత సేవల అభివృద్ధి అవసరం.
- ప్రభావవంతమైన భూ, కార్మిక, నిర్మాణ రెగ్యులేషన్లు తీసుకురావాలి.

- రైతన్నకు ప్రభుత్వ చేయూత తప్పనిసరి
- పంటలకు మద్దతు ధర, రుణ సదుపాయాలుండాలి
- అప్పుడే నిలకడైన వృద్ధి సాధ్యం
- స్పష్టం చేసిన ఆర్థిక సర్వే

న్యూఢిల్లీ, జనవరి 31: వ్యాపార, పారిశ్రామిక రంగాలు ఎంతలా విస్తరిస్తున్నా ఇప్పటికీ భారత్.. వ్యవసాయ ప్రధాన ఆధారిత దేశమేనని తాజా ఆర్థిక సర్వే చెప్పకనే చెప్పింది. కేంద్రం, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయాన్ని చిన్నచూపు చూస్తున్న నేపథ్యంలో వ్యవసాయ రంగం వృద్ధే.. దేశ ఆర్థిక లక్ష్యాల సాధనకు కీలకమని కుండ బద్దలు కొట్టింది. ఇంకా చెప్పాలంటే అధికారం కోసం రైతులకు ఎడాపెడా హామీలిచ్చి మోసం చేయడం.. దేశ వృద్ధిరేటును పరోక్షంగా అడ్డుకున్నట్టేనన్న సంకేతాలను ఈ సర్వే ఇవ్వడం గమనార్హం. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను పార్లమెంట్‌లో శనివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్న క్రమంలో శుక్రవారం ఆర్థిక సర్వే విడుదలైంది. ముఖ్య ఆర్థిక సలహాదారు వీ అనంత నాగేశ్వరన్ నేతృత్వంలోని బృందం రూపొందించిన ఈ సర్వేను లోక్‌సభలో మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. ఇక ఇందులో భారతీయ వ్యవసాయ రంగంలో ఆశించిన స్థాయిలో ఉత్పాదకత ఉండటం లేదన్న ఆందోళన వ్యక్తమైంది. ప్రస్తుతం దేశంలో తృణధాన్యాల ఉత్పత్తి ఎక్కువగానే జరుగుతున్నా.. ఇతర దేశాలతో పోల్చితే మాత్రం పంట దిగుబడులు తక్కువేనన్నది. పెరుగుతున్న ఆహార అవసరాల దృష్ట్యా వ్యవసాయ రంగంలో ఉత్పాదకత మరింత మెరుగుపడాల్సి ఉన్నట్టు ఈ సందర్భంగా సర్వే అభిప్రాయపడింది.

మద్దతు ధరలు ఉండాల్సిందే

రైతుల కష్టానికి తప్పక లాభం దక్కాల్సిందేనన్న ఆర్థిక సర్వే.. వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధర ఉండాల్సిందేనని చెప్పింది. అంతేగాక రైతులకు బ్యాంకింగ్, ఇతర సంస్థాగత రుణ సదుపాయాలను కల్పించాలన్నది.

ప్రత్యామ్నాయ పంటలు

కందిపప్పు, ఉల్లి, టమాట సాగు పెరగాలన్న సర్వే.. ఒకే రకం పంటలు కాకుండా రకరకాల పంటలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని ప్రభుత్వానికి సూచించింది. ఈ క్రమంలోనే ఉద్యానవన పంటల సాగు పెరగాలన్నది. అలాగే పశు సంపద పెరగాలని, మత్స్య, కోళ్ల పెంపకాలకు పెద్దపీట వేయాలని కూడా చెప్పింది. మొత్తానికి ద్రవ్యోల్బణం విజృంభణ, దేశ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రతికూల ప్రభావం నడుమ సర్వేలో వ్యవసాయ రంగం బలోపేతానికి పేర్కొన్న సూచనలు ఇప్పుడు మిక్కిలి ప్రాధాన్యాన్నే సంతరించుకుంటున్నాయి. ఎగబాకుతున్న ఆహార ద్రవ్యోల్బణం.. రిటైల్, హోల్‌సేల్ ద్రవ్యోల్బణాలనూ పైపైకి తీసుకెళ్తోంది. ఈ పరిణామం రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల కోతలకు అడ్డం పడుతున్నది. అధిక వడ్డీరేట్లతో ఆటో, నిర్మాణ దాని అనుబంధ రంగాల ప్రగతి దెబ్బ తింటుండగా.. యావత్తు ఆర్థిక వ్యవస్థే మసకబారిపోతున్నది.

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయేతర కార్యకలాపాల దిశగా అత్యధికులు అడుగులు వేస్తున్నారన్న సర్వే.. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే దీనికి పరిష్కారంగా పేర్కొన్నది. అప్పుడే అంతా మళ్లీ వ్యవసాయంలోకి దిగుతారన్నది. ఉత్పాదకత పెరగడానికి ఇది చాలా ముఖ్యమని కూడా నొక్కిచెప్పింది. దేశ జీడీపీలో వ్యవసాయ రంగం వాటా గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దాదాపు ఐదో వంతు వృద్ధిరేటు ఇక్కడి నుంచే వస్తున్నది మరి.

ద్రవ్యోల్బణంపై..

ఆహార ద్రవ్యోల్బణం.. కూరగాయలు, పప్పుధాన్యాల అధిక ధరలతోనే చోటుచేసుకుంటున్నదని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. ముఖ్యంగా టమాట, ఉల్లి ధరలు పెరిగిపోయాయని, గత కొన్నేండ్లలో ఉల్లి ఉత్పత్తి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో మార్కెట్‌లో డిమాండ్‌కు తగ్గ సరఫరా లేదని, దాంతో ధరలు ఎగబాకాయని పేర్కొన్నది. ఇక అననుకూల వాతావరణ పరిస్థితులు ఆహార ద్రవ్యోల్బణాన్ని ఎగదోస్తున్నాయన్న సర్వే.. ఇప్పటికీ దేశంలో అత్యధిక విస్తీర్ణంలో సాగు భూములు వర్షాధారంగా ఉండటమే దీనంతటికి కారణమని పేర్కొనడం గమనార్హం. తద్వారా సాగు నీటి ప్రాజెక్టులకు అటు కేంద్ర, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యతనివ్వడం లేదని వాపోయినట్టైంది. ఇక పంట దిగుబడులు వచ్చినా.. వాటిని మార్కెట్‌కు తరలించడం, నిల్వ చేయడం వంటి వ్యవస్థలు బలహీనంగా ఉన్నాయని, ఇవి కూడా ధరల పెరుగుదలకు దారితీస్తున్నాయంటూ ప్రభుత్వ అసమర్థతను ఎండగట్టింది.

ఉద్యోగుల్లో మానసిక వేదన

- ఆర్థిక సర్వేలో ఆందోళన
- పట్టించుకోకపోతే దేశ ఆర్థిక వ్యవస్థకే దెబ్బ

న్యూఢిల్లీ, జనవరి 31: ఉద్యోగుల్లో పెరుగుతున్న మానసిక ఆరోగ్య సమస్యలపై ఆర్థిక సర్వే ప్రత్యేకంగా స్పందించింది. ఈ అంశం కేవలం వ్యక్తిగత సమస్యే కాదన్న సర్వే.. దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కోబోయే సమస్యగా దాన్ని అభివర్ణించడం గమనార్హం. పని సంస్కృతి, పని గంటలు, జీవనశైలి వంటివి ఉద్యోగుల మానసిక ఆరోగ్యంపై ప్రధానంగా ప్రభావం చూపుతున్నట్టు పేర్కొన్నది. దీన్ని అశ్రద్ధ చేసినట్లైతే శ్రామిక శక్తినేగాక, దేశ ఆర్థిక వ్యవస్థనూ దెబ్బతీయగలదన్న ఆందోళనను వ్యక్తం చేసింది. ఇటీవలికాలంలో కొందరు బడా కార్పొరేట్లు వారానికి 70 గంటలు పనిచేయాలని, విరామం-సెలవులు లేకుండా శ్రమించాలని చెప్తున్న నేపథ్యంలో ఆర్థిక సర్వే ఆందోళనలు మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నాయి. ఇప్పటికే ఈ అంశంపై సామాజిక మాధ్యమాల్లో చర్చోపచర్చలు జరుగుతున్న విషయమూ తెలిసిందే. ఇదిలావుంటే కుటుంబ సంబంధాలు, ఆహార అలవాట్లు, సంస్థలో ఒత్తిళ్లు, రోజువారీ పని గంటలు, పని వేళలు అన్నీ ఉద్యోగి మానసిక ఆరోగ్యాన్ని అధికంగా ప్రభావితం చేస్తున్నట్టు సర్వే చెప్పింది. ఉద్యోగులు సరిగా పనిచేయకపోతే ఆ సంస్థ ఉత్పత్తి దెబ్బతింటుందని, అంతిమంగా దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తుందన్నది. కాబట్టి ఉద్యోగుల శారీరక, మానసిక ఆరోగ్యాలు రెండూ ముఖ్యమేనన్నది.

సర్వే ఏం చెప్పిందంటే..

- పనిచేసే చోట ఉండే వాతావరణం ఉద్యోగుల మానసిక పరిస్థితుల్ని ఎక్కువగా ప్రభావితం చేస్తున్నది.
- పని భారం, పై అధికారులు-సహచర ఉద్యోగులతో సంబంధాలు కూడా కీలకమే. మేనేజర్లతో సత్సంబంధాలు కలిగిన ఉద్యోగుల మానసిక ఆరోగ్యం బాగుంటున్నది. ఉన్నతస్థాయి వర్గాలతో ఉద్యోగుల ప్రవర్తన ఉత్తేజకరంగా ఉండట్లేదు.
- వర్క్ ఫ్రమ్ హోమ్, ఆఫీస్, హైబ్రిడ్ విధానం పనికి అనువైన ఆహ్లాదకర పరిస్థితులు అవసరం.
- అతిగా పని చేయడం కూడా ఇబ్బందే. ఓవర్ టైమ్ వర్క్.. ఉద్యోగుల మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నది. వారానికి 55-60 గంటలు పనిచేయడం సమస్యలకు కారణం. గంటల తరబడి కూర్చోవడం ఉద్యోగుల మానసిక పరిస్థితుల్ని ప్రభావితం చేస్తున్నది.
- జంక్ ఫుడ్, ప్యాకేజ్డ్ ఆహారోత్పత్తులకు దూరంగా ఉన్నవారితో పోల్చితే వాటిని నిత్యం తీసుకునేవారి ప్రవర్తన తేడాగా ఉంటున్నది.
- శారీరక వ్యాయామాలకు దూరంగా ఉండేవారు, సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండేవారు, కుటుంబ సభ్యులతో గడపలేకపోతున్నవారి మానసిక పరిస్థితి దెబ్బతింటున్నది.



స్టాక్ మార్కెట్లకు కరెక్షన్ తప్పదు

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈసారి కరెక్షన్‌కు గురయ్యే అవకాశాలు మెండుగావున్నాయని ఆర్థిక సర్వే హెచ్చరిస్తున్నది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న చర్యలతో అక్కడి మార్కెట్లు తీవ్ర ఆటుపోట్లకు గురికావాల్సి వస్తున్నదని, ఈ ప్రభావం దేశీయ సూచీలపై తప్పనిసరిగా వుంటుందని సర్వే అభిప్రాయపడుతున్నది. మరోవైపు, కరోనా తర్వాత ఈక్విటీ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టే యువత సంఖ్య గణనీయంగా పెరిగారని తెలిపింది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో 4.9 కోట్ల మంది ఉన్న ఈక్విటీ పెట్టుబడిదారులు డిసెంబర్ 31, 2024 నాటికి రెండున్నరెట్లు పెరిగి 13.2 కోట్లకు చేరుకున్నారు.

సైబర్ మోసాలు పెరిగాయ్

పెరుగుతున్న డిజిటలైజేషన్ భారతీయ ఆర్థిక రంగాన్ని ప్రభావవంతంగా మారుస్తున్నదని ఆర్థిక సర్వే పేర్కొన్నది. అయితే సైబర్ మోసాలూ అంతే స్థాయిలో పెరుగుతున్నాయని, దీనివల్ల అమాయకులు ఆర్థికంగా నష్టపోతున్నారని చెప్పింది. కాగా, ఓవైపు సైబర్ సెక్యూరిటీ వ్యవస్థను భారత్ బలోపేతం చేస్తున్నా, గ్లోబల్ సెక్యూరిటీ ఇండెక్స్‌లో ర్యాంక్ పెరుగుతున్నా.. సైబర్ దాడులు ఆగట్లేదని సర్వే పేర్కొనడం గమనార్హం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సైతం పెరుగుతున్న సైబర్ నేరాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే.





ఒత్తిడిలో తయారీ రంగం

దేశీయ తయారీ రంగం ఒత్తిడిలో ఉన్నట్టు ఆర్థిక సర్వే పేర్కొన్నది. మార్కెట్‌లో వినిమయ శక్తి పడిపోవడంతో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లన్నీ కుదేలైపోయిన విషయం తెలిసిందే. ఇందుకు ఆర్థిక సర్వే కూడా అద్దం పట్టింది. ధరల పెరుగుదలతో కొనుగోళ్లు అంతంత మాత్రంగానే సాగడం.. తయారీని దెబ్బతీసింది. ఇక తాజాగా కీలక రంగాల్లోనూ వృద్ధి పడకేసినట్టు తేలింది. డిసెంబర్ నెలకుగాను ఎనిమిదింటిలో నాలుగు రంగాలు డీలా పడినట్టు స్పష్టమైంది. బొగ్గు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువుల రంగాల్లో ఉత్పాదకత పడిపోయింది. కాగా, అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ లేమి.. భారతీయ ఉత్పాదక రంగంపై ప్రభావం చూపిస్తున్నట్టు ఆర్థిక సర్వే చెప్తున్నది.

వృద్ధి 6.8 శాతం లోపే

వచ్చే ఆర్థిక సంవత్సరంలో దేశ వృద్ధి 6.3 శాతం నుంచి 6.8 శాతం మధ్యలో నమోదుకానున్నదని ఆర్థిక సర్వే అంచనావేస్తున్నది. రిజర్వుబ్యాంక్ అంచనా వేసినదానికంటే తక్కువగా నమోదుకానున్నది. అలాగే మార్చితో ముగిసే ఆర్థిక సంవత్సరంలో వృద్ధి నాలుగేండ్ల కనిష్ఠ స్థాయి 6.4 శాతానికి పడిపోనున్నదని అంచనా. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా పెట్టుకున్న మోదీ సర్కార్..ఈ లక్ష్యానికి చేరుకోవాలంటే ప్రతియేటా 8 శాతానికి పైగా వృద్ధిని సాధించాల్సి ఉంటుందని ఆర్థిక సర్వే విశ్లేషించింది. అలాగే జీడీపీలో పెట్టుబడుల రేటు 35 శాతానికి పెంచాల్సిన అవసరం ఉన్నదని వ్యాఖ్యానించింది.

ఈవీలపై పన్ను ప్రోత్సాహకాలు

ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం వీటిపై పన్ను ప్రోత్సాహకాలు కొనసాగించాలని ఆర్థిక సర్వే సూచించింది. కాలుష్య ఉద్గారాన్ని తగ్గించడానికి సర్కార్ పలు కీలక చర్యలు తీసుకుంటున్నప్పటికీ, వీటి వాడకాన్ని పెంపొందించడానికి ఆర్థిక రాయితీలతో పాటు ఇతర ప్రయోజనాలు కల్పించాలని సూచించింది. ఇదే సమయంలో చమురుపై ఎక్సైజ్ సుంకాలని పెంచాలని, మరోవైపు ఎలక్ట్రిక్ వాహనాలపై రాయితీలు ఇవ్వాలని సూచించింది.

తగ్గిపోతున్న ఎఫ్‌డీఐలు

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకట్టుకోవడంలో భారత్ వెనుకంజవేస్తున్నది. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం, ద్రవ్యోల్బణ ఒత్తిడి కొనసాగుతుండటం, అభివృద్ధి చెందుతున్న దేశాలు వడ్డీరేట్లను పెంచుతుండటం, రాజకీయ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొంటుండటంతో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు ఇక్కడ ఇన్వెస్ట్ చేయడానికి జంకుతున్నారు. ఎఫ్‌డీఐలను ఆకట్టుకోవడానికి చర్యలను వేగవంతం చేయాల్సిన అవసరం ఉన్నదని సర్వే అభిప్రాయపడింది. ఎఫ్‌డీఐలకు ఊతమివ్వడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించింది.